సాక్షి
గుంటూరు
సోమవారం, 4, ఆగస్టు, 2025



గంగమ్మ తల్లి ఆలయంలో పూజలు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల గంగమ్మ తల్లి దేవాలయంలో శ్రావణమాసం పురస్కరించుకొని ఆదివారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.



ముగిసిన సంగీత నృత్యోత్సవాలు

నగరంపాలెం: గుంటూరులోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో ఐదు రోజులుగా నిర్వహిస్తోన్న సంగీత నృత్యోత్సవాలు ఆదివారం ముగిశాయి. పలువురిని సత్కరించారు.


దేశమాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు



మంచాల(చేబ్రోలు): చేబ్రోలు మండలం మంచాల గ్రామంలోని గ్రామదేవత దేశమాంబ అమ్మవారికి శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

న్యూస్‌రీల్

పశ్చిమ డెల్టాకు 7,508 క్యూసెక్కులు విడుదల



దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి 7,508 క్యూసెక్కులు ఆదివారం విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12 అడుగులు నీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవెల్‌కి 316, బ్యాంక్ కెనాల్‌కు 1,791, తూర్పు కాలువకు 749, పశ్చిమ కాలువకు 281, నిజాపట్నం కాలువకు 487, కొమ్మూరు కాలువకు 2,980, బ్యారేజి నుంచి సముద్రంలోకి 77,750 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

6న జాబ్ మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 6న మంగళగిరిలోని వీటీజేఎం – ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు గుంటూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ విద్యార్హతలు కలిగిన 18 నుంచి 35 ఏళ్ల వయసు గల నిరుద్యోగ యువతీ, యువకులు మేళాకు రావచ్చన్నారు. రెస్యూమ్, విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, ఆధార్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు జి.వి.ఎస్. సాయి కుమార్– 80745 97926, షేక్ బాజీ – 77805 88993, పి.శ్రావణి – 93473 72996లను సంప్రదించాలని సూచించారు.

యజమానులకు సెల్‌ఫోన్లు అప్పగింత



నగరంపాలెం: మొబైల్ ఫోన్లను జాగ్రత్తగా వాడాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. రూ.50 లక్షల విలువైన 250 సెల్‌ఫోన్లను నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో ఆదివారం యజమానులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఇప్పటివరకు 3,115 ఫోన్లను పోగొట్టుకున్న బాధితులకు తిరిగి అందజేశామని అన్నారు. సెల్‌ఫోన్ పోయిన వెంటనే సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా లేదా 86888 31574 నంబర్‌కు, 1930 నేషనల్ సైబర్ క్రైం హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని చెప్పారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మొబైల్ ఫోన్ల ద్వారా అధికంగా ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నాయని అన్నారు. ఈ క్రమంలో ఫోన్లను అజాగ్రత్తతో పోగొట్టుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఐటీ కోర్ సీఐ నిషార్‌బాషా, హెడ్ కానిస్టేబుల్ కిషోర్, కానిస్టేబుళ్లు శ్రీధర్, మానస, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ కరీముల్లాను అభినందించారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన భక్తుల రద్దీ మధ్యాహ్నం రెండు గంటల వరకు కొనసాగింది. శ్రావణ మాస శుభ ముహూర్తాల వేళ ఒక్కటైన నూతన వధూవరులు, వారి కుటుంబ సభ్యులు, బంధువులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తెల్లవారుజామున ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, చండీహోమంలో ఉభయ దాతలు విశేషంగా పాల్గొన్నారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని అమ్మవారికి నిర్వహించే విశేష కుంకుమార్చనలోనూ ఉభయ దాతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన నిమిత్తం అరగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేయడంతో రద్దీ మరింత పెరిగింది. మహానివేదన అనంతరం తిరిగి దర్శనాలు ప్రారంభం కాగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. భక్తులతో సర్వ దర్శనంతోపాటు రూ.100, రూ.300, రూ.500 క్యూలైన్లు కిటకిటలాడాయి. ఎండ వేడిమి, ఉక్కపోతతో క్యూలైన్‌లో భక్తులు తీవ్ర ఇబ్బందులు గురయ్యారు. అక్కడ కూలర్లు ఉన్నా వాటిని ఫ్యాన్లుగానే వినియోగించడంపై సిబ్బందిని భక్తులు ప్రశ్నించారు.

రాయే.. మృత్యువాయే

బతుకు లేక.. బతక లేక.. క్షుద్బాధను తాళలేక ..
రాయి పనికోసం ప'రాయి' ప్రాంతం నుంచి వచ్చి ఆ రాళ్లలోనే సమిధలయ్యారు.
రాష్ట్రం గాని రాష్ట్రం.. భాష గాని భాష..
అయినా ఆకలికి ప్రాంతంతోనూ.. క్షుద్బాధకు పలుకుతోనూ పనేముంది..
రాయి తీస్తే భుక్తి.. రాయితోనే తమ బాధలకు విముక్తి అనుకుని..
రెక్కలు ముక్కలు చేసుకునైనా.. నాలుగు రాళ్లు వెనకేసుకుని..
కుటుంబాన్ని పోషిద్దామనుకున్న వారి ఆశలు గ్రానైట్ రాళ్ల కింద సమాధి అయ్యాయి.

- కనీస భద్రతా చర్యలు పాటించకపోవడమే ప్రమాదానికి కారణం
- సకాలంలో ప్రాథమిక వైద్యం అందక పెరిగిన మృతుల సంఖ్య
- మృతదేహాలను గ్రానైట్ టిప్పర్‌లో తీసుకొచ్చి ఆస్పత్రి దగ్గర పడేసిన వైనం
- ప్రమాదాలు జరిగినప్పుడే స్పందిస్తున్న అధికారులు
- ఒక్క బల్లికురవ పరిసర క్వారీల్లో ఇప్పటికి వరకు 70 మందికిపైగా మృతి

క్వారీలో గ్రానైట్ రాయి పడి ఆరుగురు దుర్మరణం



టిప్పరు బాడీలో అమానవీయంగా పడవేసిన కార్మికుల మృతదేహాలు

అద్దంకి/ బల్లికురవ: పొట్టచేతపట్టుకుని గ్రానైట్ క్వారీలో పనిచేసేందుకు పొరుగు రాష్ట్రం నుంచి వచ్చిన ఆరుగురు కార్మికులు గ్రానైట్ రాయి మీద పడి ప్రాణాలు వదిలారు. మరో ముగ్గురు తీవ్ర గాయాలపాలై మృత్యువుతో పోరాడుతున్నారు. బల్లికురవ సమీపంలోని చెన్నుపల్లి–అనంతవరం రహదారిలో ఉన్న టీడీపీ సానుభూతి పరుల క్వారీ అయిన ఈర్లకొండ సత్యకృష్ణ క్వారీలో ఆదివారం ఉదయం ఈ ఘోర ప్రమాదం జరిగింది. సంఘటన సుమారు ఉదయం 10.30 గంటలకు జరగ్గా, గంట తరువాత స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అయితే ప్రమాదం జరిగిన ప్రాంతానికి ఎవరినీ అనుమతించలేదు. దాంతో అక్కడ ఇంకా కొంతమంది మృతిచెంది ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ ఒత్తిళ్లతోనే మీడియాను అనుమతించలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇప్పటివరకు 70 మందికి పైగా మృతి

బల్లికురవ, సంతమాగులూరు ప్రాంత క్వారీల్లో ఇప్పటివరకూ దాదాపు 70 మందికి పైగా బతుకు తెరువు కోసం రాష్ట్రాలు దాటి వచ్చి పనిచేస్తున్న కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసి పోయాయి. ఇలాగే వదిలేస్తే మరికొంత మంది కార్మికుల ప్రాణాలు పోయే అవకాశం ఉంది. ఇప్పటికైనా క్వారీల యజమానులు కార్మికులకు భద్రతా పరికరాలు ఇవ్వడంతోపాటు, నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలకు చెక్ పెట్టవచ్చు. అలాగే మైనింగ్ శాఖ క్వారీలపై నిరంతర నిఘాతో పర్యవేక్షణ చేస్తేనే మరో ప్రమాదం జరగకుండా చూసుకునే అవకాశం ఉంది.

భద్రతా చర్యలు గాలికి..

క్వారీల్లో నిపుణుడైన మేనేజరు (ఫస్ట్‌క్లాస్) మేట్ పర్యవేక్షణలో కార్మికులు రాయిని తీయాల్సి ఉంది. క్వారీల్లో మ్యాగజైన్/బ్లాస్టింట్ మెటీరియల్‌ను జాగ్రత్తగా దాచే విధానం ఉండాలి. అక్రమ నిల్వలతో బ్లాస్టింగ్ చేయడంతో అదీ ప్రమాదాలకు దారి తీస్తోంది. బ్లాస్టింగ్ మెటీరియల్ నిల్వలకు అనుమతులు తీసుకోవాల్సి ఉంది. దాని విషయంలో అనుమతులున్న క్వారీలను వేళ్ల మీద లెక్కపెట్టొచ్చు. ఒక్కో క్వారీలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు 100 నుంచి 150 వరకు ఉంటారు. భద్రతా ప్రమాణాలు పాటించకుండా వీరిచేత పనులు చేయిస్తుండడంతో తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

చరిత్రలోనే భారీ ప్రమాదం

ఈ ప్రాంతంలో క్వారీల చరిత్రలోనే ఈ ఘటన భారీ ప్రమాదంగా నిలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు భద్రతా పరంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. మృతిచెందిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.కోటి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

అద్దంకి రూరల్: బల్లికురవ మండలంలోని గ్రానైట్ క్వారీ ప్రమాదంలో మృతి చెందిన ఆరుగురు కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. పొట్టకూటి కోసం ఒడిశా నుంచి వచ్చిన కార్మికులు మృతి చెందడం బాధాకరమన్నారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు.

నిర్లక్ష్యంతో ఇద్దరి మృతి



దండ బడత్య మృతదేహం



ముస్సా జనా మృతదేహం

దాదాపు పది టన్నుల బరువైన రాయి మీద పడటంతో నలుగురు కార్మికులు అక్కడికక్కడే నుజ్జునుజ్జు అయ్యారు. వారి ముఖాలు కూడా సరిగా గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నాయి. మృతుల్లో మరో ఇద్దరు దండ బడత్య, ముస్సా జనా తీవ్రగాయాల పాలై ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో కన్నుమూశారు. తక్షణం ప్రాథమిక వైద్యం అందకనే వారిద్దరూ మృతిచెందారని వైద్య వర్గాల ద్వారా తెలుస్తోంది. వీరిద్దరితో పాటు గాయాలపాలైన ఎం.సుదర్శన్, కె.నాయక్, శివా గౌడ్‌లను నరసరావుపేటకు తరలించే సమయంలో అంబులెన్స్‌లో కాకుండా క్వారీకి సంబంధించిన వాహనాల్లోనే తరలించారు. ఘటనా స్థలంలో మృతిచెందిన నలుగురి మృత దేహాలను నిర్లక్ష్యంగా గ్రానైట్ టిప్పర్‌లో ఆస్పత్రికి తీసుకురావడం విమర్శలకు తావిస్తోంది. ఇంత పెద్ద దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన తమ క్వారీలో పనిచేసిన కార్మికుల మృతదేహాలను వెంట ఉండి తీసుకుని రావాల్సిన క్వారీ నిర్వాహకులు అమానవీయంగా టిప్పర్ బాడీలో మార్చూరీకి తరలించడం యాజమాన్యం నిర్లక్ష్యాన్ని బట్టబయలు చేస్తోంది.

కొరవడిన పర్యవేక్షణ



ప్రమాదం జరిగిన క్వారీ

క్వారీల్లో ప్రమాదాలు జరిగిన సమయంలో మాత్రమే మైనింగ్ శాఖ అధికారులు తనిఖీలు చేపట్టడంతో సరిపెడుతున్నారు. ఆ తరువాత వారి పర్యవేక్షణ లేకపోవడంతో క్వారీల యజమానుల ఇష్టారాజ్యంగా మారింది. ఏ క్వారీలోనూ కార్మికులకు భద్రతా పరికరాలు లేవు. నియమ నిబంధనలు పాటించడం లేదు. ఒకేషనల్ శిక్షణ మొక్కుబడిగా ముగుస్తోంది. దాని కోసం ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన శిక్షణ భవనం తలుపులు తెరిచిన దాఖలాలు లేవు.

క్షతగాత్రులను నరసరావుపేట తరలింపు



చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తూ..

నరసరావుపేట టౌన్: ప్రకాశం జిల్లా బల్లికురవ గ్రానైట్ క్వారీ ప్రమాదంలో ఆదివారం తీవ్రంగా గాయపడ్డవారిని నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మార్గ మధ్యంలో ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా చస్సనిమ్మకాడి గ్రామానికి చెందిన దండ బడత్య(48), దుగాన్ గ్రామానికి చెందిన ముస్సా జనా(43)లు మృతి చెందారు. శివరాం గౌడ్, ఆలోక్ నాయక్, సుధీర్ దులైలకు తీవ్రగాయాలయ్యాయి. అదేవిధంగా సుభాష్‌మాలిక్, దుబానాయక్, శాంతా నాయక్, ఎస్.వెంకయ్య, పవిత్ర బెహ్రాలకు స్వల్పగాయాలయ్యాయి. ఏరియా వైద్యశాల్లో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం పల్నాడు రోడ్డులోని జీబీఆర్ ప్రైవేటు వైద్యశాలకు క్షతగాత్రులను తరలించారు. రెండు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. విషయం తెలుసుకున్న బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి, చీరాల ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు, నరసరావుపేట ఆర్డీఓ మధులత, బల్లికురవ, నరసరావుపేట తహసీల్దార్‌లు రవినాయక్, వేణుగోపాల్, సంతమాగులూరు సీఐ వెంకట్రావు మృతదేహాలను సందర్శించారు. ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. ప్రమాదం తీరును కలెక్టర్ బాధితులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డిని కలెక్టర్ కోరారు.



ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ఆరోగ్య అస్థి.. నిజమైన ఆస్తి!

మనిషి ఏ పని చేయాలన్నా శరీరంలోని ఎముకలు పటిష్టంగా ఉండాలి. ఆధునిక జీవన శైలి వల్ల ఆర్థోపెడిక్ సమస్యల బారిన పడుతున్న వారి సంఖ్య ఏటా పెరిగిపోతోంది. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇండియన్ ఆర్థోపెడిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2012 నుంచి ప్రతి ఏడాది ఆగస్టు 4న దేశంలో 'బోన్ అండ్ జాయింట్ డే'ను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న కథనం.



- ఏటికేడు పెరుగుతున్న ఆర్థోపెడిక్ సమస్యలు
- సమతుల ఆహారం, వ్యాయామంతో మేలు
- మారిన జీవనశైలితో యువతలోనూ కీళ్ల సమస్యలు
- అందుబాటులో అత్యాధునిక వైద్య సేవలు
- నేడు 'బోన్ అండ్ జాయింట్ డే'



గుంటూరు జీజీహెచ్ ఆర్థోపెడిక్ ఓపీ కేసుల వివరాలు

ఏడాది	ఓపీ రోగుల సంఖ్య
2020	24,569
2021	33,567
2022	47,814
2023	49,678
2024	51,096

గుంటూరు మెడికల్ : గుంటూరుకు చెందిన రోహిత్ పదో తరగతి చదువుతున్నాడు. ఇటీవల కాలంలో ఆటలాడుతూ కింద పడటంతో చెయ్యి విరిగింది. తల్లిదండ్రులు ఆర్థోపెడిక్ వైద్యుల వద్దకు రోహిత్‌ను తీసుకెళ్లారు. ఏసీ తరగతి గదుల్లో ఉండటం, చదువుల ఒత్తిడిలో సమతుల ఆహారం కూడా తీసుకోకపోవడం, ముఖ్యంగా క్యాల్షియం సరిపడా ఉంటే ఫుడ్ తీసుకోకపోవడం వల్లే కొద్దిపాటి దెబ్బలకే ఎముకలు విరిగిపోతున్నాయని వెల్లడించారు.

సమస్యలకు కారణాలివీ....

ఆధునిక జీవన శైలి వల్ల ఎక్కువ మంది ఏసీలకే పరిమితమై కొంతసేపు కూడా సూర్యరశ్మి సోకకుండా గదుల్లోనే ఉండిపోతున్నారు. దీంతో విటమిన్ 'డి' లోపంతో ఎముకల పటుత్వం తగ్గిపోతోంది. ఫాస్ట్‌ఫుడ్స్ ఎక్కువగా తీసుకోవడం, వ్యాయామం చేయకపోవడం వల్ల కూడా ఊబకాయం పెరిగిపోయి ఆర్థోపెడిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. వయస్సు పైబడిన వారు సహజసిద్ధంగా తమ శరీరంలో తగ్గిపోయే కాల్షియాన్ని తిరిగి భర్తీ చేసుకోవడం లేదు. ఇదీ ఆర్థోపెడిక్ సమస్యలకు కారణం అవుతోంది. స్మోకింగ్ వల్ల కూడా కాల్షియం స్థాయి పెరగకుండా ఎముకల అరుగుదల జరుగుతుంది. జిల్లా వ్యాప్తంగా ఆర్థోపెడిక్ సర్జన్లు 350 మంది ఉన్నారు. రోజూ ఒక్కో వైద్యుడి వద్దకు 50 మంది పలు సమస్యలతో చికిత్స పొందుతున్నారు.

జీజీహెచ్‌లో ఉచితంగా వైద్యం



గుంటూరు జీజీహెచ్‌లో ఆర్థోపెడిక్ సమస్యలకు రోజూ ఓపీ విభాగంలో ఉచిత సేవలు అందిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి క్యాజువాలిటీలో 24 గంటలూ వైద్యులు అందుబాటులో ఉండి, ఎమర్జెన్సీ ఓటీలో ఆపరేషన్లు చేస్తున్నారు. రోజూ 300 మంది ఓపీ విభాగంలో వైద్య సేవలు పొందుతున్నారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ఆధునిక వసతులు సాధారణ, ఎమర్జెన్సీ ఆపరేషన్లు పదికిపైగా నిత్యం చేస్తున్నారు.

– డాక్టర్ యశస్వి రమణ,
సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్, సూపరింటెండెంట్

జాగ్రత్తలతో ఎముకలు పదిలం



ఆధునిక జీవనశైలితో చిన్న వయస్సులోనే స్పయిన్ సమస్యలు వస్తున్నాయి. నడుంనొప్పి, మెడనొప్పి వంటి సమస్యలు యువతలో కనిపించటం చాలా ఆందోళనకరం. రోజూ గుడ్డు, పాలు, రాగిజావ, పాలకూర వంటి సమతుల ఆహారంతోపాటు రోజూ వ్యాయామం చేయాలి. ఊబకాయం లేకుండా చూసుకోవాలి. జంక్‌ఫుడ్, స్మోకింగ్‌కు దూరంగా ఉండాలి. మహిళలు 40 సంవత్సరాలు దాటితే తప్పనిసరిగా ఎముకల ఆరోగ్యంపై దృష్టి సారించి ప్రత్యేక ఆహారం తీసుకోవాలి.

– డాక్టర్ జె.నరేష్‌బాబు,
సీనియర్ స్పైన్ సర్జన్, గుంటూరు

యుక్తవయస్సులోనే కీళ్ల అరుగుదల



ఆధునిక జీవనశైలి వల్ల యుక్త వయస్సులోనే కీళ్లు అరిగిపోతున్నాయి. ముందుగా గుర్తిస్తే ఆపరేషన్ లేకుండా తగ్గించవచ్చు. బీఎంఆర్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్టుకు చెందిన ఉన్నతి ఫౌండేషన్ ద్వారా గతంలో గుంటూరు జీజీహెచ్‌లో వంద మందికి ఉచితంగా మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లు చేశాం. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగులకు, హెల్త్ ఇన్సూరెన్సు కార్డుల ద్వారా సాధారణ ప్రజలకు ఉచితంగా మోకీళ్ల మార్పిడి ఆపరేషన్ చేస్తున్నాం.

– డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి,
సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, గుంటూరు

రైతుల పక్షాన మాట్లాడడం తప్పా?

- వరికూటి అశోక్‌బాబుపై దాడి హేయం
- మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి అంబటి రాంబాబు

రేపల్లె: అమ్మ అన్నం పెట్టదు... అడుక్క తిననివ్వదన్న చందంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనితీరు ఉందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు పేర్కొన్నారు. రేపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబును ఆదివారం అంబటి రాంబాబు పరామర్శించారు. అనంతరం వైద్యశాల ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. కాల్వలలో పూడికలు తీయటానికి ప్రభుత్వానికి మనసు రావటం లేదని, తాము తీసుకుంటామని ఆ ప్రాంత ప్రజలు, రైతులు కోరుతున్నా అనుమతులు ఇవ్వటం లేదన్నారు. రైతుల సమస్యలపై పోరాడుతున్న వరికూటి అశోక్‌బాబు గత మూడు రోజులుగా రేపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో దీక్ష చేస్తుంటే అటు పాలకులకు గానీ, ఇటు అధికారులకుగానీ చీమకుట్టినట్లయినా లేదన్నారు. రైతుల పక్షాన మాట్లాడడమే ఆయన చేసిన తప్పా అని ప్రశ్నించారు.

చంద్రబాబు, లోకేష్‌లు బాధ్యత వహించాలి

భట్టిప్రోలు నుంచి కనగాల వరకు మురుగు కాలువల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూటి కాడ తొలగించాలని అశోక్‌బాబు ధర్నా చేస్తే అతనిపై పోలీసులు జులుం ప్రదర్శించటం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా అనేక పోరాటాలు, ఆందోళనలు చేపడుతున్న అశోక్‌బాబుకు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలుస్తున్నారన్నారు. రేపల్లె పట్టణ సీఐ మల్లికార్జున రావు అధికారిగా కాకుండా కూటమి కార్యకర్తగా వ్యవహరిస్తున్నాడని, భవిష్యత్‌లో ఇబ్బందులు పడక తప్పదని హెచ్చరించారు. అశోక్‌బాబుపై వ్యక్తిగత దాడి చేయటం సీఐ అవివేకానికి నిదర్శనం అన్నారు. అశోక్‌బాబుకు ఏమైనా జరిగితే చంద్రబాబు, లోకేష్‌లు బాధ్యత వహించాలన్నారు. ఆయన వెంట పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు కరేటి శేషగిరిరావు, మేడికొండ అనిల్, జిల్లా అధికారి ప్రతినిధి కేవీ కృష్ణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చదలవాడ శ్రీనివాసరావు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ చిత్రాల ఓబేదు, నాయకులు చిమటా బాలాజీ, బొర్రా శ్రీనివాసరావు, యార్లగడ్డ మదన్‌మోహన్,వీసం నాగలక్ష్మి, సజ్జా పద్మావతి, లియాకత్ బాషా తదితరులు ఉన్నారు.

జన సాగరం



నదీతీరంలో నిలిచిపోయిన వాహనాలు

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ క్రస్ట్‌గేట్ల నుంచి దిగువకు దుముకుతున్న కృష్ణమ్మ సోయగాలను తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది ప్రజలు ఆదివారం తరలివచ్చారు. దీంతో నాగార్జున సాగర్ పర్యాటక కేంద్రం కిటకిట లాడింది. సాగర్‌డ్యాం దిగువున విద్యుదుత్పాదన కేంద్రం రేడియల్ క్రస్ట్‌గేట్ల వరకు సుమారు ఐదు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. కృష్ణాతీరంలోని కొత్తబ్రిడ్జి, టి–జంక్షన్, డౌన్ మార్కెట్, లాంచీ స్టేషన్, పుష్కరఘాట్ ప్రాంతాలు, మధ్యాహ్నం భోజన సమయంలో హోటళ్లు జనంతో కిటకిటలాడాయి. చాలామందికి హోటళ్లలో భోజనం దొరకని పరిస్థితి ఎదురయ్యింది. రోడ్ల వెంట చేప ముక్కలు ఫ్రై చేసే దుకాణాల వద్ద రద్దీ కనిపించింది. నాగార్జునకొండకు ఆదివారం పర్యాటకులు పోటెత్తడంతో లాంచీస్టేషన్‌కు రూ. 2,12,750 ఆదాయం సమకూరింది. మహాస్తూపం, అశ్వమేధ యాగశాల, స్నానఘట్టం, మ్యూజియంలోని 9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, బుద్ధుని జీవిత చరిత్రకు సంబంధించిన శిలాఫలకాలను పర్యాటకులు తిలకించారు.

క్లుప్తంగా

ప్రపంచ జంప్‌రోప్ పోటీలకు తెనాలి బాలిక



భారత జట్టుతో యుక్తాశ్రీ (ఎడమ నుంచి రెండో బాలిక)



కె.యుక్తాశ్రీ

తెనాలి: జపాన్‌లో జూలై 25వ తేదీ నుంచి జరుగుతున్న వరల్డ్ జంప్ రోప్ చాంపియన్‌షిప్-2025లో స్థానిక వెస్ట్ బెర్రీ స్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని కె.యుక్తాశ్రీ తల పడుతోంది. ఇంటర్నేషనల్ జంప్ రోప్ యూనియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలు ఆగస్టు 5వ తేదీ వరకు కొనసాగు తాయి. వివిధ దేశాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. భారత్ తరఫున యుక్తాశ్రీ జట్టులోకి ఎంపికైందని స్కూల్ ప్రిన్సిపాల్ టీవీ సుబ్రహ్మణ్యం అన్నారు. గతేడాది నేపా ల్‌లో ఇటీవల జరిగిన ఇండో-నేపాల్ జంప్ రోప్ చాంపియన్‌షిప్ పోటీల్లోనూ యుక్తాశ్రీ సత్తా చాటింది. ఎల్‌ఆర్‌ఎస్ గ్రూప్ ఈవెం ట్‌లో బంగారు పతకాన్ని పొందింది. 20 సెకన్ల డబుల్ అండర్ ఈవెంట్‌లోనూ కాం స్య పతకాన్ని గెలుచుకుంది.

ఉత్సాహంగా జూడో పోటీలు



మంగళగిరి: మండలంలోని యర్రబాలెం డాన్‌బాస్కో స్కూలులో ఆదివారం జిల్లా స్థాయి జూడో పోటీలు ఉత్సాహంగా సాగాయి. జిల్లా జూడో అసోషియేషన్ ఆధ్వ ర్యంలో జరిగిన ఈ పోటీలలో ఎం.గురుతేజ (30 కేజీల విభాగంలో), డి.రేవంత్‌బాబు (35), జి.ప్రసాద్(40), ఎస్.యశ్వంత్ (45), సీహెచ్ లక్ష్మి (50), పి.నాగచరణ్ (55), కె. గౌతమ్ (60), పి.నాగచరణ్ (65), కె.దుర్గా ప్రసాద్, టి. ఫ్రాన్స్‌జాకబ్ (66), ఎస్. దివ్యశ్రీ, (38), ఎం.ప్రశాంత్ దయ(32), సీహెచ్ శివనాగజ్యోతి (36), డి.పార్వతి (40), పి.పావని (44), ఎస్‌కే అప్సన (48), టి.విజయలక్ష్మి (52), వై.అమూల్య, జి.మ ధురిమ (57 కేజీల విభాగం)లో విజయం సాధించారు. ఈ మేరకు సంఘ అధ్యక్షుడు ఎ. శ్రీహరి నాయుడు తెలిపారు. కార్యక్రమం లో బి.కిరణ్, పీఈటీ రాజు, కోచ్ నాగదుర్గ, కిరణ్ కుమార్, జి.సాంబశివరావు, సబ్ జూనియర్ సెలెక్టెడ్ స్టేట్ టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేట్'లకు కారుచౌకగా భూములు

- కూటమి ప్రభుత్వ తీరుపై సీపీఎం మండిపాటు
- పాలనను గాలికొదిలేసి వారి చుట్టూ ప్రదక్షిణలు చేస్తోందని ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై. నేతాజీ

తాడేపల్లి రూరల్: కార్పొరేట్ సంస్థలకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రూ.కోట్ల విలువైన భూము లను కారుచౌకగా కట్టబెడుతోందని సీపీఎం మం డిపడింది. ఈ మేరకు ఆ పార్టీ గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ ఆరోపించారు. ఆదివారం రాజధాని డివిజన్ కమిటీ సమావేశాన్ని ఉండవ ల్లిలోని పార్టీ కార్యాలయంలో కుంభ ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చే సిన వై. నేతాజీ మాట్లాడుతూ.. రాజధాని అమరావ తిలో ప్రభుత్వ అధికారులు చెబుతున్న వివరాల ప్రకారం 63 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు సంస్థలకు భూములు కేటాయించార న్నారు. ఇప్పటికీ 55 సంస్థలు అసలు నిర్మాణ పనులే ప్రారంభించలేదని విమర్శించారు. రాజధాని రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్‌లలో అభివృద్ధి పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో తెల పాలని కోరారు. పనులు చేపట్టని ఆయా సంస్థలకు కేటాయించిన భూముల వద్ద నిరసన కార్య క్రమాలు చేపడతామని హెచ్చరించారు. అధికారం లోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన కూటమి నేతలు ఇప్పుడు ప్రజలపై భారాన్ని మోపారని విమర్శించారు. ప్రజా సమస్యలను వది లేసి కార్పొరేట్ సంస్థల చుట్టూ పాలకులు ప్రదక్షి ణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సమావేశంలో పార్టీ రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, డివిజన్ నాయకులు టి.బక్కిరెడ్డి, ఎం.భాగ్యరాజు, జె.నవీన్ ప్రకాష్, పేరం బాబూరావు, గైరబోయిన నాగేశ్వ రరావు, అత్తలూరి వీర వెంకయ్య, పార్వతి, కె.రామ కృష్ణ, షేక్‌ఖాదర్ బాబా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఫోర్ బాల్ టోర్నమెంట్ ప్రారంభం

పోటీలను ఆరంభించిన కే-రిడ్జి చైర్మన్ నాతాని



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కే-రిడ్జి పాఠశాల చైర్మన్ నాతాని

నరసరావుపేట ఈస్ట్: గెలుపోటములను సమానం గా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తిని అలవరచుకోవటం ద్వారా జీవితంలో ఉన్నతంగా ఎదగవచ్చని కే-రిడ్జి పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం రాష్ట్రస్థాయి అండర్-14, అండర్-19 బాలబాలికల ఫ్లోర్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను ప్రారంభించిన నాతాని మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో ప్రావీణ్యం సాధిం చాలని సూచించారు. క్రీడల ద్వారా శారీరక, మాన సిక దృఢత్వంతోపాటు క్రమశిక్షణ అలవడుతుందని తెలిపారు. తద్వారా విద్యలోనూ రాణించగలరని తెలిపారు. కాగా, పోటీలలో పాల్గొనేందుకు 16 జిల్లాల నుంచి 250 మంది బాలబాలికలు, జట్టు అధికారులు హాజరయ్యారు. కార్యక్రమంలో పాఠ శాల డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, జిల్లా ఫోర్ బాల్ కార్యదర్శి కిషోర్‌బాబు, ఏపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.సురేంద్ర, వివిధ జిల్లాల కార్యదర్శులు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు విశ్వబ్రాహ్మణుల ప్రదర్శన

ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, విశ్వబ్రాహ్మణ వర్గీయులు

నరసరావుపేట: పట్టణంలో అన్యాక్రాంతమైన బ్రహ్మం గారి దేవాలయం ఆస్తులను కాపాడాలని, విశ్వక ర్మలకు చట్టసభల్లో స్థానం కల్పించాలని, విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటుచేసి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ ఆదివారం నరసరావుపేట నుంచి విజయవాడ వరకు చేపట్టిన విశ్వకర్మ బైక్ యాత్రలో జిల్లా నలుమూలల నుంచి విశ్వబ్రాహ్మణ సంఘీయులు పాల్గొన్నారు. జిల్లా విశ్వబ్రాహ్మణ సం ఘం అధ్యక్షుడు సుతారం వాసు ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు జెండా ఊపి ప్రారంభించారు. తొలుత పల్నాడు రోడ్డులోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి, శ్రీ భగవాన్ విశ్వకర్మ విగ్రహాలకు బీజేపీ నాయకులు రంగిశెట్టి రామకృష్ణ, రాష్ట్ర ఎస్సీ నాయకులు మేడి కొండ సత్యానందబాబు ప్రత్యేక పూజా కార్య క్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే చదలవాడ మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులకు అన్ని విషయా లలో అండగా ఉంటానని వారి ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం నుంచి తోడ్పాటు కల్పించే విధంగా కృషి చేస్తానని అన్నారు. పట్టణంలో సత్తెనపల్లి రోడ్డు లోగల శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం ఆస్తు లను అక్రమంగా అమ్మడంపై విచారణ జరిపించి సంఘానికి చెందిన దేవాలయ భూములను కాపా డాలని ఎమ్మెల్యేను కోరారు. విజయవాడ అమ్మవా రికి శ్రావణమాసం సందర్భంగా సారె బహుకరించి అమ్మవారి ఆశీస్సులను అందుకున్నారు. పట్టణ కార్యదర్శి బొప్పూడి సాయిప్రసాద్, కోశాధికారి వేములూరి రాంబాబు, దాచేపల్లి టౌన్ ప్రెసిడెంట్ త్రయంబకచారి, మండల ప్రెసిడెంట్ నాగబ్రహ్మా చారి, గురజాల మండల ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, టౌన్ ప్రెసిడెంట్ కుందుర్తి కోటేశ్వరరావు, మాచర్ల గురజాల అప్పారావు, పిడుగురాళ్ల ప్రెసిడెంట్ దికొండ లక్ష్మణాచారి, కారంపూడి మండల ప్రెసి డెంట్ లింగాచారి, విశ్వబ్రాహ్మణులు పాల్గొన్నారు.

ముగిసిన జర్నలిస్టుల పునశ్చరణ తరగతులు

తెనాలి: ఆంధ్రప్రదేశ్ సీఆర్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ఏపీయూడబ్ల్యూజే సహకారంతో జిల్లా గ్రామీణ విలేకరుల శిక్షణ తరగతులు రెండో రోజైన ఆదివారం కొనసాగాయి. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఆదివారం ఉదయం అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో దేవగళ్ల రామకృష్ణ, డి.సోమసుందర్, బీహెచ్‌వీ మంగేష్, అజయ్‌లు 'విలేకరుల నుంచి డెస్క్ ఏం కోరుకుంటుంది', 'గ్రామీణ కథనాలు, పత్రికా భాష, మెలకువలు', 'స్మార్ట్ రిపోర్టింగ్' అం శాలపై ప్రసంగించారు. సాయంత్రం జరిగిన ముగింపు సభలో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సీఆర్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ అధ్యక్షత వహిం చారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, పూర్వ ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్, అకాడమీ కార్యదర్శి మణిరామ్ మాట్లాడారు. ఆహ్వాన కమిటీ పర్యవేక్షించింది.

ముగిసిన ఏసీఏ నామినేషన్ల ఘట్టం

మంగళగిరి: ఆంధ్ర క్రికెట్ అసోషియేషన్ నామినే షన్ల ఘట్టం ఆదివారంతో ముగిసింది. ఈ నెల 16వ తేదీన ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ తరఫున డాక్టర్ కె గోవిం దరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. మండలంలోని నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లో జరిగిన నామి నేషన్లలో కార్యదర్శి పదవికి రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు తన నామినేషన్‌ను నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌కు సమర్పించారు. ఏసీఏ అధ్యక్ష పదవికి కేశినేని శివనాథ్, ఉపాధ్యక్ష పదవికి బం డారు నరసింహారావు, ట్రెజరరీ పదవికి దం డమూడి శ్రీనివాస్, కౌన్సిలర్ పదవికి దండు గౌరువిష్ణు, జాయింట్ సెక్రటరీ పదవికి బి.విజయ కుమార్, బి. శ్రీనివాసరాజు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ ఉపసంహరణకు ఈ నెల 11వ తేదీ గడువుగా నిర్ణయించారు.

కృష్ణానదిలో స్నానానికి దిగి యువకుడు మృతి



వేము రవికిరణ్ (ఫైల్)

కొల్లిపర: కృష్ణానదిలో స్నానానికి దిగి యువకుడు మృతి చెందిన సంఘటన కొల్లిపర శివారు కొత్త బొమ్మువానిపాలెంలో జరిగింది. ఎస్‌ఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాలు... మండల పరిధిలోని తూములూరు గ్రామానికి చెం దిన వేము రవికిరణ్ (19)తన స్నేహితులతో కృష్ణా నదికి వచ్చాడు. నదిలో రవికిరణ్ ఆడుకుంటుం డగా కృష్ణానది ఉరవడికి కొట్టుకుపోయాడు. ఈ విషయాన్ని పోలీసుస్టేషన్‌లో కుటుంబ సభ్యులు తెలపగా వెంటనే ఎస్‌ఐ కోటేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్ల చేత గాలింపు చేయించారు. ఎట్టకేలకు రవికిరణ్ మృతదేహం లభ్యం కావడంతో కేసునమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలిం చినట్లు ఎస్‌ఐ కోటేశ్వరరావు తెలిపారు.

ప్రధానోపాధ్యాయుల సంఘం పల్నాడు జిల్లా కార్యవర్గం ఎన్నిక



నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ ప్రధానో పాధ్యాయుల సంఘం పల్నాడు జిల్లా శాఖ అధ్య క్షుడిగా రామిశెట్టి గోవిందరాజులు (జెడ్పీ హైస్కూ ల్, కాకాని), ప్రధాన కార్యదర్శిగా రెడ్డి శ్రీనివాస రెడ్డి (జెడ్పీ హైస్కూల్, వెన్నాదేవి), కోశాధి కారిగా పులిపాటి శ్రీనివాసరావు (జెడ్పీ హైస్కూల్, తూబాడు) ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. సంఘం సర్వసభ్య సమావేశం, సంఘం పల్నాడు జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికను ఆది వారం ప్రకాష్‌నగర్‌లోని శ్రీతిలక్ మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించారు. సంఘం గౌరవాధ్య క్షునిగా కొండా శ్రీనివాసరావు (సంతగుడిపాడు), రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా బి.ఎం.సుభాని (రొంపి చర్ల), ఏ.శ్రీనివాసరెడ్డి (75 తాళ్లూరు), ఎస్.వి జయలక్ష్మి (కోటప్పకొండ), జిల్లా ఆర్గనైజింగ్ సెక్ర టరీగా ఎం.రామారావు (బొగ్గరం), జిల్లా కేంద్రం సెక్రటరీగా వై.హనుమంతరావు (గోగులపాడు), మీడియా ప్రతినిధిగా వి.వెంకటరావు (సాతు లూరు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధి కారిగా సంఘం గుంటూరుజిల్లా అధ్యక్షుడు జి.శ్రీ నివాసరావు, పరిశీలకునిగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జి.శ్రీనివాసరావు వ్యవహరించారు. నూతన అధ్యక్ష, కార్య దర్శులు గోవిందరాజులు, శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర నాయకత్వం, సంఘం సభ్యుల సహకారంతో ప్రధానోపాధ్యాయుల సమ స్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎ.విద్యాసాగర్

తాడేపల్లి రూరల్: ప్రభుత్వ ఉద్యోగులతోపాటు ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏపీ ఎన్ జీవో సంఘం కృషి చేస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్ అన్నారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ఆర్టీసీ ఎన్‌ఎంయూఏ రాష్ట్ర కార్యాలయం లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.రమణారెడ్డి అధ్యక్షతన కేంద్ర కమిటీ సమావేశాన్ని నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా ఎ. విద్యాసాగర్ మాట్లాడు తూ.. ఎన్‌ఎంయూఏ చేపట్టే ప్రతి కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీవో కలసి నడుస్తుందన్నారు. సంఘం రాష్ట్ర కార్యాలయ నిర్మాణం కోసం సహాయ సహ కారాలు అందించేందుకు ఏపీ ఎన్‌జీవో, ఏపీజేఏ సీలు సిద్ధంగా ఉన్నాయన్నారు. నాలుగేళ్లుగా నిలి చిపోయిన పదోన్నతుల ప్రక్రియను పునఃప్రారం భించాలన్నారు. ఆర్టీసీలో 8 వేలకుపైగా ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఎన్‌ఎంయూఏ రాష్ట్ర అధ్యక్షులు పీవీ రమణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా డిపో గ్యారేజీలను ఆధునీకరించాలని కోరారు. ఎన్‌ఎంయూఏ ప్రధాన కార్యదర్శి వై.శ్రీని వాసరావు, సంయుక్త కార్యదర్శి రాజేష్ కుమార్, ఉపాధ్యక్షులు శ్రీనివాసరాజు, సూర్యచంద్రరావు, పీవీ శివారెడ్డి, భాస్కర నాయుడు, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సరికొత్త ఆవిష్కరణలకు నాంది పలకాలి



మాట్లాడుతున్న చైర్మన్ లావు రత్తయ్య



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న విజయవాడలోని ఆర్‌ఆర్ స్పోర్ట్స్ ఫౌండర్ గల్లా రాధారాణి

విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య

చేబ్రోలు: సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను విద్యార్థులు గుర్తించి పరిష్కారానికి నూతన ఆవి ష్కరణలకు నాంది పలకాలని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య పిలుపునిచ్చారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సి టీలో ఆన్‌లైన్ లెర్నింగ్, ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నిం గ్‌లో ఎంసీఏ, ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థులకు 3వ స్నాతకోత్సవం, పాలిటెక్నిక్ ఎడ్యుకేషన్ మొదటి స్నాతకోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ 3వ స్నాతకో త్సవం, పాలిటెక్నిక్ ఎడ్యుకేషన్ మొదటి స్నాతకో త్సవం సందర్భంగా 1,191 మంది విద్యార్థులకు డిగ్రీలు అందజేశారు. డాక్టర్ రత్తయ్య మాట్లా డుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలతో మేనేజ్‌మెంట్ నైపు ణ్యాలను ఏకీకృతం చేయాలన్నారు. విజ్ఞాన్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ విద్యార్థులందరికీ డిజైన్ చేయడం, డీబగ్ చేయడం, డిస్ప్లాయ్ చేయగల త్రీడీ నైపు ణ్యాలు ఇప్పుడు అత్యవసరమని అన్నారు. దేశం లో డిజిటల్ మార్పులు వేగంగా చోటు చేసుకుం టున్నాయన్నారు. భారతావనికి ఇన్నోవేటర్ల అవ సరం ఉందని, ప్రపంచంలో మూడవ అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా భారత్ ఎదిగిందని తెలిపారు. అందుకున్న విద్యార్థుల సంబరం అంబరాన్ని అంటింది. సంప్రదాయ వస్త్రధారణలో వచ్చారు. వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ పీఎంవీ రావు, బోర్డు ఆఫ్ మేనేజ్‌మెంట్ సభ్యులు, డీన్లు, స్నాతకోత్సవ కన్వీనర్లు, విద్యార్థులు, తల్లిదం డ్రులు పాల్గొన్నారు.



డిగ్రీలు అందుకున్న విద్యార్థులు

తరంగ గానానికే సంపత్ జీవితం అంకితం

- విశ్లేషకుడు వారణాసి రఘురామశర్మ
- ఘోరకవి శ్రీకృష్ణ సంపత్‌కుమార్‌కు పురస్కారం ప్రదానం



శ్రీకృష్ణసంపత్‌ను సన్మానిస్తున్న పుట్టంరాజు దంపతులు

అద్దంకి: తరంగ గానానికే శ్రీకృష్ణ సంపత్‌కుమార్ జీవితం అంకితమైందని విశ్లేషకుడు వారణాసి రఘు రామశర్మ పేర్కొన్నారు. తరంగ గాన లోకంలో అపూ ర్వమైన ప్రతిభను ప్రదర్శిస్తున్న ఘోరకవి శ్రీకృష్ణ సంపత్ కుమార్‌కు పుట్టంరాజు బుల్లెయ్య, రామ లక్ష్మమ్మల విస్తృత కళా పురస్కారం అందజేశారు. పుర స్కార ప్రదాన కార్యక్రమం స్థానిక పుట్టంరాజు కళాక్షే త్రంలో ఆదివారం నిర్వహించారు. పద్య కవి డీవీఎం సత్యనారాయణ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహిం చారు. చప్పిడి వీరయ్య సభాహ్వానం పలికారు. పుర స్కార గ్రహీత సంపత్ కుమార్ గురించి వారణాసి రఘురామశర్మ సభకు పరిచయం చేశారు. సంపత్ తరంగ గానంలో జీవితాన్ని అంకితం చేసిన మహ నీయుడిగా సత్యనారాయణ అభివర్ణించారు. శింగర కొండ నరసింహక్షేత్రం, నారాయణ తీర్థుల వారికి గల సంబంధాన్ని పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి వివరించారు. పోలూరి వెంకట శివరామ ప్రసాద్ శ్రీకృష్ణలీలా తరంగిణి వైభవాన్ని విశ్లేషిస్తూ ఉపన్యసిం చారు. ఎన్వీఎల్ హనుమంతరావు, నారాయణ బాల సుబ్రహ్మణ్యం, యూవీ రత్నం తదితరులు సంపత్ తరంగ సేవలను ప్రశంసించారు. పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, శైలజ దంపతులు ఘోరకవిని సత్కరిం చారు. కార్యక్రమంలో కార్యదర్శి కేవీ పోలిరెడ్డి, కోశా ధికారి చుండూరి మురళీ సుధాకరరావు, నిమ్మరాజు నాగేశ్వరరావు, యు. దేవపాలన, జి.దివాకరదత్తు, మోటుపల్లి రామదాసు, మలాది శ్రీనివాసరావు, షేక్ మస్తాన్, కూరపాటి రామకోటేశ్వరరావు, ఆర్టిస్టు బాలు, శ్రీమన్నారాయణ, మక్కెన వెంకటేశ్వర్లు, పి.అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

చీరాల రూరల్: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం చీరాల రైల్వేస్టేషన్ వద్ద దక్షిణ యార్డు ప్రాంతంలో చోటుచే సుకుంది. జీఆర్పీ ఎస్‌ఐ సీహెచ్ కొండయ్య తెలిపిన వివరాల మేరకు.. సుమారు 35 సంవత్సరాలు వయస్సు కలిగిన ఓ వ్యక్తి రైల్లో ప్రయాణిస్తూ ప్రమా దవశాత్తు జారిపడి మృతి చెందాడు. మృతుడి శరీరం పై పింక్, బ్లాక్ రంగు కలిగిన గళ్ల చొక్కా, బాంబే స్టైల్స్ టీఎస్‌ఎల్ అనే లేబుల్ ఉన్నట్లు చెప్పారు. బ్లూ కలర్, బ్లాక్ రంగు కలిగిన స్పోర్ట్స్ బెల్ట్ చెప్పులు ధరించి ఉన్నాడని తెలిపారు. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వాసుపత్రికి తర లించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలి పారు. మృతుని వివరాలు తెలిసినవారు 94406 27646 ఫోను నంబర్‌కు తెలపాలని సూచించారు.

భార్యను నమ్మించి ఉసురుతీసిన భర్త

- భర్త వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేయాలనుకున్న ఫైనం
- నమ్మకంగా తీసుకెళ్లి చున్నీతో హత్య చేసిన భర్త
- నరసరావుపేటలో వెలుగు చూసిన దారుణం



కుమారుడి పుట్టిన రోజు సందర్భంగా కేక్ తినిపిస్తున్న మేరీ, రమేష్ దంపతులు (ఫైల్)



మేరీని బైకుపై తీసుకెళ్తున్న భర్త రమేష్

నరసరావుపేట టౌన్: భర్తపై పెట్టుకున్న నమ్మకమే ఆమె పాలిట ఉరితాడైంది. పోలీస్ గడప తొక్కితే తన గడపలో కాపురం కుదుటపడుతుం దని భావించిన ఆమెకు అవే ఆఖరి ఘడియలుగా మారాయి. మద్యానికి బాని సైన భర్త, భార్యను నమ్మకం గా తీసుకెళ్లి కడతేర్చిన ఘటన నరసరావుపేటలో ఆది వారం వెలుగు చూసింది. వివరాలు.. కంభంపాలేనికి చెందిన తొరటి మేరీ(29), సత్తెనపల్లి మండలం గార్ల పాడుకు చెందిన జొన్నలగడ్డ రమేష్‌ను ఎనిమిదేళ్ల క్రితం వివాహం చేసుకుంది. రమేష్ ఆటో నడుపుతూ ఉంటాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మద్యానికి బానిసైన రమేష్, భార్యను అనుమానిస్తూ వేధిస్తూ ఉండేవాడు. శనివారం పోలీస్ స్టేషనుకు వెళ్లి ఫిర్యాదు చేస్తానని భర్తను బెదిరించింది. తాను కూడా వస్తానని ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని స్టేషనుకు తీసుకెళ్ల కుండా రావిపాడు రోడ్డు వైపు తీసుకెళ్లాడు. ఈ విష యాన్ని తల్లి కోటమ్మకు మేరీ ఫోన్ చేసి చెప్పింది. కొద్ది సేపటి తర్వాత ఇద్దరి సెల్‌ఫోన్లు స్విచ్ ఆఫ్ అని రావటంతో అనుమానం వచ్చిన కోటమ్మ వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదుతో అదృశ్యం కేసు నమోదు చేశారు. రమేష్‌ను అదుపు లోకి తీసుకుని విచారించగా, నేరం అంగీకరించాడు.

చున్నీతో గొంతు బిగించి హత్య..

భార్యను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని శనివారం భర్త రమేష్ నకరికల్లు నుంచి కారంపూడి వెళ్లే మార్గం లో రైల్వే ట్రాక్ పక్కన నిర్మానుష్య ప్రదేశానికి తీసుకె ళ్లాడు. అక్కడ ఆమె గొంతుకు చున్నీ బిగించి కాలుతో నొక్కి దారుణంగా హత్య చేశాడు. రమేష్ ఇచ్చిన సమాచారంతో ఆదివారం వన్‌టౌన్ సీఐ ఎం.విజయ్ చరణ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని గుర్తించి, పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు.

పోలీసుల అదుపులో బంగారం దొంగలు

-చోరీ సొత్తు కోసం పోలీసుల ప్రయత్నం

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో ఈ ఏడాది ఏప్రిల్ నెలలో జరిగిన చోరీ కేసులో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. సంతగుడిపాడు గ్రామానికి చెందిన రామాల ప్రసన్నారెడ్డి ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో దొంగలు ఇంటి పైకప్పు కత్తిరించి ఇంట్లోకి ప్రవేశించి 20 సవర్ల బంగారం, రూ.50 వేల నగదు దొంగిలించారు. ఇంటి యజమాని ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. యజ మానులు ఇంట్లో లేకపోవడాన్ని అదునుగా చూసుకొని దొంగతనానికి పాల్ప డ్డారు. యజమాని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చారు. ఆయినప్పటికీ తనకు న్యాయం జరగలేదని తాను నష్టపోయిన సొమ్మును రికవరీ చేయించాలని పోలీస్ ఉన్నతాధికారులకు స్పందనలో తెలియజేశారు. అప్పటి నుంచి పోలీ సులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ముమ్మరం చేశారు. లభ్యమైన క్లూ ఆధారంగా అనుమానిత దొంగలను అదుపులోకి తీసుకొని విచారిం చారు. విచారణలో దొంగిలించిన బంగారాన్ని ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో తనఖాపెట్టి కొంత రుణాన్ని పొందినట్లు తెలుసుకున్నారు. తాకట్టు ఉంచిన కొన్ని రోజుల తర్వాత వేరే వారితో డబ్బులు కట్టించి బంగారాన్ని విడిపించి నట్లు ఒప్పుకున్నారు. ఆ బంగారాన్ని మార్కెట్‌లో అమ్మి సొమ్ము చేసుకు న్నట్లు నేరాన్ని అంగీకరించినట్లు సమాచారం.

విద్యుదాఘాతంతో రైతు మృతి



తాహసిల్ నాయక్ (ఫైల్)



సంఘటనా ప్రాంతంలో రైతు మృతదేహం

బొల్లాపల్లి: తెగి పడిన విద్యుత్ వైర్ తగిలి రైతు మృతి చెందిన సంఘటన బొల్లాపల్లి మం డలం రేమిడిచర్ల గ్రామ పొలాల్లో జరిగింది. బం డ్లమోటు పోలీ సులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన భూక్యా తాహసీల్ నాయక్ (50)కి రెండెకరాల సొంత భూమి ఉంది. తన పొలంలో పత్తి పంట సాగు చేశాడు. పొలం చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నాడు. ఆదివారం తన భార్యతోపాటు కూలీలను తీసుకుని పొలానికి పత్తి విరుపు కోసం వెళ్లారు. పొలాన్ని ఆనుకుని ఉన్న 11 కె.వి, ఎల్‌టీ విద్యుత్ లైన్లు ఉన్నాయి. ఎల్‌టీ విద్యుత్ లైన్ వైరు తెగి పొలం చుట్టూ ఏర్పాటుచేసిన సోలార్ ఫెన్సింగ్ వైర్‌పై పడింది. నాయక్ ఇది గమనిం చలేదు. పొలంలోకి వెళ్లేందుకు ఫెన్సింగ్ తొలగిస్తుండగా తెగిపోయిన విద్యుత్ వైరు కాలికి తగిలింది. షాక్‌కు గురైన రైతు తహసీల్ నాయక్ అక్కడికక్కడే మృ తి చెందాడు. అతనికి భార్య నలుగురు సంతానం ఉన్నారు. భార్య మం గబాయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు బం డ్లమోటు ఎస్సై ఎ.బాలకృష్ణ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అధికారుల తప్పిదం వల్లే ప్రమాదం

ఒకే స్తంభానికి ఎల్‌టీ, 11 కేవీ విద్యుత్ వైర్లు విద్యు త్‌శాఖ ఏర్పాటు చేసింద ని, నిబంధన ప్రకారం పైన 11 కేవీ విద్యుత్ లైన్ ఉండాలని కింద ఎల్‌టీ విద్యు త్ వైర్లు ఏర్పాటు చేయాలని కానీ అలా చేయలేదని, వైర్లు తెగిపడి ప్రమాదం జరిగి రైతు మృతి చెందాడని కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు ఇప్పటికైనా నిర్లక్ష్యాన్ని వీడి విద్యుత్ లైన్లు సక్రమంగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.